టీకా.. పశువులకు శ్రీరామరక్ష

- గాలికుంటు వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి
- వాతావరణ మార్పుల కారణంగా జీవాలు వ్యాధి బారిన పడే అవకాశం
- సకాలంలో వైద్యం అందకపోతే మృత్యువాతపడే ప్రమాదం
- ముమ్మరంగా కొనసాగుతున్న వ్యాక్సినేషన్ కార్యక్రమం

ఎమ్మిగనూరురూరల్: పశువులకు టీకాలు శ్రీరామరక్ష అని పశువైద్యులు చెపుతున్నారు. వాతావరణ మార్పులు మొదలవగానే పశువులు ముఖ్యంగా గాలికుంటు వ్యాధి బారినపడే అవకాశం ఉందని వైద్యులు పేర్కొంటున్నారు. సకాలంలో వ్యాక్సిన్ వేస్తే వ్యాధి నుంచి రక్షణ పొందవచ్చు. సకాలంలో వైద్యం అందకపోతే చనిపోతాయని హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో జీవాలకు రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం ఉచిత టీకాల కార్యక్రమం చేపట్టింది. ప్రస్తుతం నియోజవర్గ వ్యాప్తంగా అన్ని పశువైద్యశాలల ఆధ్వర్యంలో వ్యాక్సినేషన్ కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. పశుపోషకులు, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని జీవాలను కాపాడుకోవాలని పశువైద్యులు సూచిస్తున్నారు.


పశువులకు టీకాలు వేస్తున్న డాక్టర్ అశోక్‌కుమార్

ట్యాగ్ ఆధారంగా టీకాలు..

మండలంలో పశువులు గ్రామాల్లో గోపాల మిత్రాలు గతేడాది పశువులకు ట్యాగ్‌లు వేశారు. ప్రస్తుతం ట్యాగ్‌ల ఆధారంగా పశువులను గుర్తించి టీకాలు వేస్తున్నారు. ఇప్పటి వరకు పశువులకు ట్యాగ్ వేయించుకోకపోతే ట్యాగ్ వేయించుకోవాలంటున్నారు వైద్యులు. ఎమ్మిగనూరు మండలంలో గేదేలు 7, 824 ఉండగా, ఆవులు 15, 747 ఉన్నాయి. నందవరం పరిధిలో గేదెలు 3,663, ఆవులు 9,123 గోనెగండ్లలో గేదెలు 7,314, ఆవులు 14,981 ఉన్నాయి. కాగా ఇప్పటి వరకు గోనెగండ్ల పశువైద్య కేంద్రం పరిధిలో 4,851 జీవాలకు, నందవరం పరిధిలో 3,869, ఎమ్మిగనూరు పరిధిలో 4,125 పశువులకు టీకాలు వెశారు. ఈ నెలాఖరు వరకు టీకాల కార్యక్రమం కొనసాగుతుందని పశువైద్యాధికారులు తెలిపారు.

గాలికుంట వ్యాధి లక్షణాలు

పశువులకు గాలికుంట వ్యాధి సోకిన వెంటనే జ్వరం వస్తుంది. నాలుక, చిగుళ్లు, కాలి గెట్టల మధ్య పుండ్లు ఏర్పడుతాయి. మేత మేయవు, ఎక్కువ సేపు నిల్చోలేవు, ఎక్కువ దూరం నడవలేవు, నురగ కక్కుతూ ఉంటాయి.

వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించాలి



పశువులకు గాలికుంటు వ్యాధి సోకకముందు వ్యాక్సిన్ వేయించాలి. వ్యాధి వచ్చినట్లు గుర్తిస్తే వెంటనే పశువైద్యులను సంప్రదిస్తే ఫలితం ఉంటుంది. వ్యాధి వచ్చిన తరువాత కంటే రాకముందు వ్యాక్సిన్ వేయిస్తే మంచిది. పశువైద్యల దృష్టికి పశువులకు వ్యాధి సోకిన విషయం తీసుకువస్తే వైద్యం అందించి రోగం ప్రబలకుండా నివారించవచ్చు, లేకపోతే చనిపోతాయి.

– డాక్టర్ సుబ్రహ్మణ్యాచారి, ఏడీఏ, ఎమ్మిగనూరు

నివారణ ఇలా..

వ్యాధి సోకిన వెంటనే పశువులను గుర్తించి గుంపు నుంచి వేరుచేసి కట్టేయాలి. ఇలా చేయకపోతే ఇతర పశువులకు వ్యాధి సోకే ప్రమాదం ఉంది, వెంటనే పశువైద్యుడిని సంప్రదించి వైద్యం చేయించాలి. వ్యాధి సోకక ముందు ఎఫ్‌ఎండీ వ్యాక్సిన్ వేయించాలి, సోకిన తరువాత పెన్సిలిన్, యాంటీ ఇష్లమిన్, యాంటీ ఇష్లమేటరీ డ్రగ్స్ వాడుతూ నోటిలో, గాలి గిట్ట మధ్య గ్లిజనిరత్‌తో శుభ్రం చేసి బోరిక్ పౌడర్ పట్టించాలి.

క్లుప్తంగా

శ్రీరంగనాథుడికి లక్ష్మీకాసుల హారం విరాళం


ఈఓకు దండను అందజేస్తున్న దాతలు

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో వెలసిన శ్రీరంగనాథస్వామికి ఉల్లిందకొండకు చెందిన భక్తులు రాజారెడ్డి రూ.1.60 లక్షలు విలువచేసే 30 గ్రాముల లక్ష్మీకాసుల దండను విరాళంగా అందజేశారు. ఈ మేరకు గురువారం ఈఓ చంద్రశేఖర్‌రెడ్డికి హారాన్ని అందజేశారు. ఈఓ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల సందర్భంగా అమ్మవారికి ఈ దండను అలంకరించి పూజలు చేయడం జరుగుతుందన్నారు. దాతలకు స్వామి వారి ప్రసాదం అందజేశారు.

పారిశుద్ధ్య పనులకు ప్రాధాన్యం

ఎమ్మిగనూరు టౌన్: పట్టణంలో పారిశుద్ధ్య పనులకు అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని హెచ్‌బీఎస్ కాలనీ,ఎల్‌ఐసీ కార్యాలయం తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించారు. మురుగు కాలువలతో పాటు రోడ్లను క్రమం తప్పకుండా శుభ్రం చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి


మాట్లాడుతున్న జడ్జి తరణి

ఆలూరు రూరల్: విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఆలూరు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి తరణి అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేశారు. జడ్జి మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవడం వల్ల సమాజంలో ఎలా ఉండాలన్నది తెలుస్తుందన్నారు. బాగా చదివి అత్యున్నత స్థాయికి ఎదగాలన్నారు. సమాజంలో మహిళలు పురుషులకు సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారని చెప్పారు. మహిళలను గౌరవించి..వారికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. న్యాయవాదులు వాయుజీవోత్తమ రావు, విజయ్ కుమార్, సునీత ఫ్లారెన్స్ రంగప్ప, శాకీర్, ఎస్‌ఐ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

శనగల కొనుగోళ్లు ప్రారంభం


ఆస్పరిలో శనగల కొనుగోళ్లను ప్రారంభించిన ఏఓ మునెమ్మ

ఆస్పరి: ఆస్పరిలోని రైతు భరోసా కేంద్రంలో గురువారం మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో శనగల కొనుగోళ్లను ప్రారంభించారు. ఏఓ మునెమ్మ మాట్లాడుతూ ప్రతి రైతు నుంచి వంద క్వింటాళ్ల దాకా కొనుగోళ్లు చేస్తామన్నారు. క్వింటా ధర రూ.5,335 ప్రకారం ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. ఆస్పరి తరువాత మిగతా చిన్న హోతూరు, జొహరాపురం గ్రామాలలో కూడా కొనుగోళ్లను ప్రారంభిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆలూరు డీసీఎంఎస్ ఇన్‌చార్జ్ ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

గర్భిణులకు భోజన సదుపాయం



భోజనం వడ్డిస్తున్న డాక్టర్ సుజాత

పత్తికొండ రూరల్ : పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రికి స్కానింగ్ పరీక్షల నిమిత్తం విచ్చేసిన గర్భిణులు వారి వెంట వచ్చిన సహాయకులకు గురువారం సేవాదళ్ ఆధ్వర్యంలో భోజన వసతి కల్పించారు. ప్రభుత్వ ఆసుపత్రి వైద్యురాలు సుజాత గర్భిణులకు భోజనం వడ్డించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇలాంటి సేవా కార్యక్రమం నిర్వహించడం ఎంతో సంతోషదాయకమని పరీక్షల నిమిత్తం వచ్చిన గర్భిణులు సేవాదళ్ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్టాఫ్ నర్స్ శాంతిలక్ష్మి, వార్డు మెంబర్లు లైట్ నాగరాజు, ఎంపీటీసీ అనిత, ముస్లిం మైనారిటీ నాయకుడు సాబ్దిన్ నూర్ బాషా పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆలూరు: అరికెరలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో 5వ, తరగతి, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో చేరేందుకు అర్హులైన విద్యార్థులు ఈనెల 24వ తేదీలోగా ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ టి.శ్రీనివాసరెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి ప్రవేశాలకు https:// appcet. apfss. in, ఇంటర్మీడియెట్‌కు https:// apgpcet. apcfss. in/ inter వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పగుళ్లిచ్చిన గృహాల పరిశీలన

తుగ్గలి: ఈనెల 7వ తేదీన రాతన గ్రామంలో పగుళ్లు ఇచ్చిన పలువురి ఇళ్లను గురువారం జిల్లా అధికారుల బృందం పరిశీలించింది. భూకంపం అంటూ ప్రచారం జరగడంతో అధికారుల బృందం పర్యటించింది. పీఆర్ ఎస్ఈ సుబ్రహ్మణ్యం, హౌసింగ్ పీడీ వెంకటనారాయణతో పాటు జియో మైసూర్ సర్వీసెస్ ప్రైవేటు కంపెనీ లిమిటెడ్ జియలాజిస్టు వేదానందరెడ్డి గ్రామంలో పగుళ్లు ఇచ్చిన ఇళ్లను సందర్శించి ఇంటి యజమానులతో మాట్లాడారు. పగుళ్లకు కారణాలపై ఆరా తీశారు. నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామని అధికారులు తెలిపారు. హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు విజయకుమార్, హనుమంతు, పంచాయతీ కార్యదర్శి శివ ఉన్నారు.


రాతనలో వివరాలు సేకరిస్తున్న జిల్లా అధికారులు

క్రమశిక్షణతో చదువుకోవాలి

గోనెగండ్ల : పదో తరగతి విద్యార్థులు క్రమ శిక్షణతో చదివి పదిలో మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని ఎంఈఓ వినోద్ కుమార్ అన్నారు. గురువారం హెచ్. కై రవాడిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. అలాగే పదో తరగతి ప్రీఫైనల్ పరీక్షలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితేనే మంచి మార్కులు వస్తాయన్నారు. గణితం, సైన్స్ సబ్జెక్టులపై కొంత మంది కష్టం అవుతుందని భయంతో ఉంటారు. అలాంటి అపోహలు పెట్టుకోకుండా భయం వీడి కొంచెం కష్టపడితే అన్ని సబ్జెక్టులు సులువుగానే ఉంటాయని విద్యార్థులకు తెలియజేశారు.

నెలాఖరులోపు వడ్డీ చెల్లిస్తే ప్రయోజనం

చిప్పగిరి: సొసైటీలో రైతులు తీసుకున్న రుణాలకు మార్చి 31 లోపు వడ్డీ చెల్లిస్తే అధిక ప్రయోజనాలు పొందవచ్చని సొసైటీ సెక్రెటరీ హరికృష్ణ గురువారం తెలిపారు. స్థానిక సొసైటీ బ్యాంకులో ఆయన మాట్లాడుతూ రైతులు తీసుకున్న క్రాప్ రుణాలకు మార్చి 31 లోపు వడ్డి చెల్లిస్తే వారు కట్టిన వడ్డిలో 3% ప్రభుత్వం రిటర్న్ ఇస్తుందని తెలిపారు. అలాగే ఎల్టి, రైతునేస్తం, ట్రాక్టర్ లోన్స్ తదితర రుణాలు మార్చి 31 లోపు చెల్లస్తే అపరాదపు వడ్డి భారం పడదని చెప్పారు.

పన్నులు సకాలంలో చెల్లించాలి

ఆస్పరి: మేజర్ గ్రామ పంచాయితీ ఆస్పరిలో ఇంటి, కుళాయి, వృత్తి పన్ను చెల్లించాలని సర్పంచ్ మూలింటి రాధమ్మ, ఈఓ రామాంజినేయులు గురువారం తెలిపారు. ఈనెల 15వ తేదీలోపు చెల్లించకుంటే పంచాయతీ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవడమే కాకుండా కొళాయి కనెక్షన్ తొలగిస్తామని హెచ్చరించారు. ఇప్పటికే రెండు సార్లు గ్రామంలో దండోరా కూడా వేయించామన్నారు.

వలస వెళ్లొద్దు

హొళగుంద: వలసలు వెళ్లి అనేక ఇబ్బందులు పడకుండా ఇక్కడే ఉపాధి పనులు చేసుకుంటూ సురక్షితంగా ఉండాలని మద్దిలింగదహళ్లి గ్రామ సర్పంచ్ సుధాకర్ కూలీలకు సూచించారు. గురువారం గ్రామ పరిధిలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న పంట కాలువ పూడిక తీత పనులను పరిశీలించారు. అదేవిధంగా ఉపాధి కూలీలను పనులు, కూలీ డబ్బులు సక్రమంగా అందుతున్నాయా లేదా వసతులు తదితర వాటి గురించి అడిగి తెలుసుకున్నారు. ఫీల్డ్ అసిస్టంట్ పరమేశ్, మేటీలు ఖాదర్‌బాషా, తిప్పన్న, వీరేశ్ తదితరులు ఉన్నారు.

17న కోగిలతోటలో మేటి కుంభోత్సవం

హొళగుంద: మండల పరిధిలోని కోగిలతోట గ్రామంలో ఈ నెల 17న సుంకలమ్మ, మారెమ్మ దేవతల మేటి కుంభోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కురువ బుజ్జమ్మ, సర్పంచ్ యాట గురుపాదమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు శేషప్ప, నాగప్ప, వెంకటేష్ తదితరులు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా 16న గంగి పూజ, అమ్మ వార్ల దర్శన కార్యక్రమం ఉంటుందన్నారు. 17న శుక్రవారం తెల్లవారుజామున 3.35 గంటలకు మేటి కుంభోత్సవాల ఊరేగింపుతో పాటు ఆలయాలో జలాభిషేకాలు, ఆకుపూజ, మహా మంగళహారతి, నైవేద్య సమర్పణ ఇతర ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు.

బీమా మంజూరు

ఆస్పరి: మండలంలోని చొక్కనహళ్లి గ్రామానికి చెందిన బోయ మహాలక్ష్మికి ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా యోజన కింద రూ.4లక్షలు బీమా మంజూరైనట్లు ఆస్పరి ఎస్‌బీఐ మేనేజర్ అమర్నాథ్ శ్రీనివాస్ తెలిపారు. గురువారం ఎస్‌బీఐ కార్యాలయంలో ఆమెకు రూ.4లక్షలు మంజూరు పత్రాన్ని అందజేశారు. రెండు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మండలంలోని చొక్కనహళ్లి గ్రామానికి చెందిన బోయ రాజు మరణించారు. ఎస్‌బీఐలో బీమా చెయడం వల్ల బీమా సొమ్మును మృతుడు బోయ రాజు భార్య బోయ మహాలక్ష్మికి అందజేస్తున్నట్లు మేనేజర్ తెలిపారు.

శరవేగంగా బీటీ రోడ్డు నిర్మాణం

- దశాబ్దాల తరువాత తీరనున్న ప్రజల సమస్య
- నెలాఖరులోగా పూర్తికానున్న పనులు

ఎమ్మిగనూరుటౌన్: మున్సిపాలిటీ పరిధిలోకి వచ్చే స్థానిక మిలటరీకాలని, వెంకటాపురం తదితర కాలనీ వాసులకు పట్టణంలోకి వచ్చే రాకపోకల రోడ్డు సమస్య తీరనుంది. దశాబ్దాలుగా రోడ్డు లేకపోవడంతో వర్షాకాలంలో ఆయా ప్రాంతాల వారు పట్టణానికి రాకపోకలు కొనసాగించేందుకు గుంతలమయమైన మట్టి రోడ్డులో వారు పడే కష్టాలు వర్ణణాతీతం. గత ప్రభుత్వ హయంలో రోడ్డు ఊసేలేకపోయింది. అయితే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని ఆయా కాలనీలకు వెళ్లే ప్రధాన రహదారికి 14వ ఆర్థిక సంఘం కింద రూ.కోటి మంజూరు చేయించి బీటీ రోడ్డు నిర్మాణానికి ఇటీవల భూమిపూజ చేశారు. దీంతో ప్రస్తుతం మంజూరైన నిధులతో పట్టణం నుంచి ఆయా కాలనీలకు వెళ్లేందుకు గాను 80అడుగుల వెడెల్పుతో దాదాపు కిలోమీటర్ మేర నిర్మాణ పనులను కాంట్రాక్టర్ ముమ్మరం చేశారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యత ఉండేలా మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, డీఈ మనోహర్‌రెడ్డి, ఏఈ ప్రవీణ్‌కుమార్‌రెడ్డిలు నిత్యం పర్యవేక్షిస్తుండటంతో పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈనెలాఖరులోగా పనులు పూర్తిచేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. దీంతో కొన్నేళ్లుగా పరిష్కారానికి నోచుకొని రోడ్డు సమస్య తీరనుండటంతో ఆయా ప్రాంత వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


వెంకటాపురం కాలనీ రహదారిలో బీటీ రోడ్డు నిర్మాణం జరుగుతున్న దృశ్యం


శిల్పా ఎస్టేట్ సమీపంలో నిర్మితమైన రోడ్డు

వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించండి

ఎమ్మిగనూరుటౌన్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి పట్టభద్రులు ఓట్లు వేసి గెలిపించాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి కోరారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, ప్రభుత్వ,ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో పట్టభద్రులైన ఉపాధ్యాయులను కలిసి కరపత్రాలిచ్చి ఓట్లు అభ్యర్థించారు. ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉద్యోగ, నిరుద్యోగుల సమస్యలను పరిష్కారదిశగా అడుగులు వేస్తున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు బుట్టారంగయ్య, జిల్లా వక్ఫ్‌బోర్డు ఉపాధ్యక్షుడు రియాజ్‌అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.


బాలికల పాఠశాలలో ఓట్లు అభ్యర్థిస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి

ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించుకుందాం

ఆలూరు: పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, స్థానిక సంస్థలు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ వైఎస్సార్ సీపీ అభ్యర్థులు వెన్నపూస రవీంద్రారెడ్డి, డాక్టర్ బోయమధుసూదన్, ఎంవీ రామచంద్రారెడ్డిలను గెలిపించుకోవాల్సి బాధ్యత వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులపై ఉందని ఆలూరు నియోజకవర్గం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పరిశీలకులు మల్కిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి సూచించారు. మండల కేంద్రమైన దేవనకొండలో గురువారం వివిధ ప్రభుత్వ పాఠశాలలు, సచివాలయాలను సందర్శించి ప్రచారం నిర్వహించారు. గ్రాడ్యుయేట్లు, ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీల సభ్యులతో సమావేశమైయ్యారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఆలూరు, ఆస్పరి, చిప్పగిరి, హాలహర్వి, హొళగుంద, దేవనకొండ మండలాలో 72 మంది ఎంపీటీసీలు, ఆరుగురు జెడ్పీటీసీల సభ్యులు, 4,500 మంది గ్రాడ్యుయేట్లు, 149 మంది ఉపాధ్యాయులు ఉన్నారన్నారు. ప్రధానంగా సచివాలయ కన్వీనర్లు, మండల కన్వీనర్లు, ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలించుకోవాలని చెప్పారు. నిరుద్యోగ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఓటర్లను అవగాహన కల్పించాలన్నారు. అందుకు నియోజకవర్గం నుంచి ప్రాతినిద్యం వహిస్తున్న రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం సూచనలు, సలహాలు తీసుకోవాలన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు రామకృష్ణ, మండల కన్వీనర్ మల్లికార్జున, ఎమ్మెల్సీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజారెడ్డి, కో–ఆప్షన్ మెంబర్ జిబేదర్‌సాహేబ్ తదితరులు పాల్గొన్నారు.


పట్టభద్రుల ఓటర్లను అభ్యర్థిస్తున్న మల్కిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి

గర్భిణులకు నిపుణులతో వైద్యపరీక్షలు

మద్దికెర : గర్భిణులకు ప్రసవంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక నిపుణులతో వైద్యపరీక్షలు చేయిస్తున్నట్లు ప్రభుత్వ వైద్యాధికారి నగేష్, శ్రీలక్ష్మి తెలిపారు. గురువారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కింద గుంతకల్లు ప్రీతి నర్సింగ్‌హోం గైనకాలజిస్టు డాక్టర్ సరోజమ్మతో గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రతి నెల నిపుణులచే 8 రకాల వైద్యపరీక్షలు నిర్వహించడమే గాకుండా మందులు ఉచితంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గర్భిణులకు జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి బ్రెడ్లు, పండ్లు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మల్లికార్జున, సీహెచ్ఓ నిరంజన్‌బాబు, హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.


గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న గైనకాలజిస్టు డాక్టర్ సరోజమ్మ

విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు స్థల పరిశీలన


చిట్యాలలో స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కృష్ణగిరి: గ్రామాల్లో రైతులకు వ్యవసాయం కింద నాణ్యమైన విద్యుత్ అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని డోన్ ఆపరేషన్ డీఈ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని చిట్యాల గ్రామంలో నూతనంగా సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేసేందుకు గురువారం ఆయన కన్‌స్ట్రక్షన్ డీఈ రాజేష్, తహసీల్దార్ పురుషోత్తం కలిసి స్థలాన్ని పరిశీలించారు. మండలంలో ఈ గ్రామ సమీపాన వ్యవసాయ కనెక్షన్లు అధికంగా ఉండటంతో నూతనంగా విద్యుత్ సబ్‌స్టేషన్‌ను మంజూరు చేయడం జరిగిందన్నారు. ఇందుకోసం గ్రామ సమీపంలోని సర్వే 307లో ఎకరా స్థలాన్ని పరిశీలించామన్నారు. స్థలానికి సంబంధించిన ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపి అనుమతులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ట్రాన్స్‌కో ఏఈ మద్దిలేటి, వీఆర్వో అయ్యన్న ఉన్నారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి

కృష్ణగిరి: మండల పరిధిలోని కర్లకుంట గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు కృష్ణమాచార్యులు(52) గురువారం గుండెపోటులతో మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఈయన గత కొన్నేళ్లుగా స్వగ్రామమైన కర్లకుంట ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తూ ఈఏడాది జనవరిలో పదోన్నతిపై బేతంచర్ల మండలం కొత్తపల్లె హైస్కూల్‌కు వెళ్లారు. డోన్‌లో నివాసముంటున్న ఇతనికి ఉదయం ఇంట్లో చాతీ నొప్పిరాగా ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలు తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందినట్లు వారు తెలిపారు. మృతునికి భార్య పావని, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

ఓటరు స్లిప్పుల పంపిణీ పూర్తి

వెల్దుర్తి మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్లకు స్లిప్పుల పంపిణీ దాదాపు పూర్తి చేసినట్లు తహసీల్దార్ రాజేశ్వరి గురువారం తెలిపారు. ఓటరు లిస్ట్‌లో పేరు ఉండి, ఓటరు స్లిప్పు లేనివారికి పోలింగ్ బూత్ వద్ద హెల్ప్‌డెస్క్ ద్వారా ఓటరు స్లిప్పు అందజేస్తామన్నారు. ఓటరు స్లిప్పుతోపాటు ఆధార్, రేషన్, పాన్, డ్రైవింగ్ లైసెన్స్ తదితర ఏదేని ఐడీ కార్డు తప్పనిసరిగా వెంట తెచ్చుకోవాలని సూచించారు.

చలివేంద్రం ప్రారంభం

హొళగుంద: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఉన్న మూడు రోడ్ల కూడలిలో ఎస్ఎస్‌వీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గురువారం వైఎస్సార్‌సీపీ నాయకులు ఈశా, కోగిల తోట శేషప్ప, ఎస్కే గిరి, పంపాపతి, షబ్బీర్ తదితరులు చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఆలూరు, ఆదోని తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు సౌకర్యంగా ఉండేలా చలివేంద్రం ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్, ఎంపీటీసీ శివన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

భక్తుల కోసం షెడ్డు నిర్మాణం


నిర్మించిన షెడ్డులో ఆలయ ఈఓ, అర్చకులు, దాతలు

మద్దికెర : మండల పరిధిలోని పెరవలి గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీరంగనాథస్వామి దేవాలయంలో భక్తుల సౌకర్యార్థం బెల్డోన గ్రామానికి చెందిన కోనంకి గోవిందమ్మ, కోనంకి అశోక్‌ల జ్ఞాపకార్థం వారి మనవరాలు కావ్య చౌదరి రూ.11.50 లక్షలతో షెడ్డు నిర్మించారు. గురువారం పూజలు నిర్వహించి షెడ్డును ప్రారంభించారు. ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, అర్చకులు రంగస్వామి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి దాతలకు ప్రసాదాన్ని అందజేశారు.

నాగలదిన్నెలో లోకాయుక్త విచారణ


శ్మశాన వాటిక స్థలాన్ని పరిశీలిస్తున్న లోకాయుక్త సభ్యుడు రిటైర్డు డీఎస్పీ తిరుపాల్‌రెడ్డి


నందవరం : మండల పరిధిలోని నాగలదిన్నె గ్రామంలోని శ్మశాన వాటిక స్థలంపై లోకాయుక్త సభ్యుడు రిటైర్డు డీఎస్పీ తిరుపాల్‌రెడ్డి విచారణ చేపట్టారు. గ్రామంలోని సర్వేనంబర్ 94లో భూ ఆక్రమణ జరిగిందంటూ ఫిర్యాదులు రావడంతో ఆయన స్థలాన్ని సందర్శించి విచారణ చేశారు. గురువారం సదరు స్థలంలోని షాపింగ్ కాంప్లెక్స్, ఇళ్ల నిర్మాణాలపై క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. విచారణలో తహసీల్దార్ నిత్యానందరాజు, ఎంపీడీఓ కృష్ణమూర్తి, ఈఓపీఆర్‌డీ ఈశ్వరయ్య, ఎస్ఐ మహేష్‌కుమార్ పాల్గొన్నారు.

ఏఎస్ఐకి పదోన్నతి


ఎస్ఐ కృష్ణమూర్తి

మద్దికెర: మద్దికెర పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న కృష్ణమూర్తికి ఎస్ఐగా పదోన్నతి కల్పించి అన్నమయ్య జిల్లా రాయచోటికి బదిలీ చేశారు. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు అందినట్లు ఆయన తెలిపారు.

గజ వాహనంపై శ్రీరంగనాథుడు


గజేంద్రునిపై కొలువు తీరిన శ్రీవారు

మద్దికెర : మండల పరిధిలోని పెరవలి గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీరంగనాథుడు వార్షిక బ్రహ్మోత్సవాల భాగంగా గురువారం గజవాహన సేవ నిర్వహించారు. ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలతో పాటు పల్లకీ సేవ కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం రాత్రి శ్రీరంగనాథుడు, శ్రీదేవి, భూదేవిల ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి గజేంద్రుడి వీపుపై కొలువు చేసి గ్రామ వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. శుక్రవారం ఉదయం స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం, సాయంత్రం అశేష భక్తజనవాహిని మధ్య రథోత్సవం నిర్వహించనున్నారు.

పుల్లగుమ్మిలో పోలీసుల పల్లెనిద్ర


మాట్లాడుతున్న ఎస్‌బీ డీఎస్పీ వెంకటాద్రి

వెల్దుర్తి: మండల పరిధిలోని ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామమైన పుల్లగుమ్మిలలో గురువారం పోలీసులు పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. సీఐ యుగంధర్, ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డిల ఆధ్వర్యంలో జరిగిన గ్రామసభలో స్పెషల్ బ్రాంచ్ కర్నూలు డీఎస్పీ వెంకటాద్రి హాజరై మాట్లాడారు. ప్రజలు శాంతియుతంగా జీవించాలని, అందుకు ఫ్యాక్షన్‌కు, గొడవలకు స్వస్తి పలకాలన్నారు. పిల్లలను బాగా చదివించుకోవాలన్నారు. నేరాల వలన కలిగే నష్టాలు వివరించారు. చిన్నచిన్న గొడవలను క్షణికావేశంలో పెద్దవిగా చేసుకోవద్దన్నారు.

నేడు విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ

కృష్ణగిరి: మండల పరిధిలోని మన్నెకుంట గ్రామంలో నూతనంగా నిర్మించిన సుంకులాపరమేశ్వరి దేవాలయం, గణపతి, నందీశ్వర, కుమారస్వామి, పార్వతి దేవి, లింగమయ్య విగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠ ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. గురువారం నూతన విగ్రహాలకు జలాధివాసం నిర్వహించి గ్రామంలో ఊరేగించారు. ఆలయ ప్రాంగణంలో పురోహితులు హోమాలు నిర్వహించారు. శుక్రవారం ఉదయం 8.10 గంటలకు మీన లగ్నమందు విగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ట నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందని, రాత్రి గ్రామానికి చెందిన మారుతి చెన్నకేశవ భజన సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి భజన పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ట్యాంక్ నిర్మాణానికి భూమిపూజ

వెల్దుర్తి: స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో కొలువైన సుంకులమ్మ అమ్మవారి ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం వాటర్ ట్యాంక్ నిర్మాణానికి గురువారం భూమిపూజ జరిగింది. ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి భూమిపూజ నిర్వహించగా ట్యాంకు నిర్మాణ దాత తొగర్చెడు నాగేశ్వర్‌రెడ్డి, పూజారులు బెస్త కుటుంబీకులు పూజల్లో పాల్గొన్నారు.